క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: బీవీకే, సీపీఎం ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 2న శనివారం మంచికంటిహాల్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ ఆస్పత్రి సౌజన్యంతో నరములు, వెన్నెముక, తలనొప్పి, బీపీ, షుగర్, పక్షవాతం, కంటి, చెవి, ముక్కు, గొంతు తదితర అనారోగ్య సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ జరుగుతుందని తెలిపారు. నగర ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖానాపురం పారిశ్రామిక ప్రాంత విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బల్లేపల్లి సెక్షన్ ఏఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పారిశ్రామిక ప్రాంతం, జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, కై కొండాయిగూడెం, గణేష్‌టౌన్‌షిప్, యూపీహెచ్‌కాలనీ, బాలాజీనగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, విని యోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మోటాపురం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కాంగ్రెస్, టీడీపీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. రహదారుల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ఇతరత్రా అభివృద్ధి పనుల్లో తమ గ్రామానికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావెళ్ల కృష్ణారావు, బెల్లం శ్రీనివాసరావు, చావా కోటయ్య, బెల్లం వాసు, బెల్లం కృష్ణామూర్తి, గుగులోత్ చంటి, మురళి, చావా హరి, నంబూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన వారోత్సవాలు నిర్వహించండి

ఖమ్మంమయూరిసెంటర్: అమరవీరుల వారోత్సవాలను ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు ఖమ్మం డివిజన్ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అరుణోదయ నాగన్న, జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని లెనిన్ నగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన పోరాటయోధులను స్మరించుకుంటూ ఈ నెల 9 వరకు అమరవీరుల వారోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, నాయకులు వై.ప్రకాష్, వీవీ రావు, పరకాల లక్ష్మక్క, పి.మోహనరావు, షేక్ సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను గుర్తించడం అభినందనీయం

నేలకొండపల్లి: కులగణన సర్వేలో దివ్యాంగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో చేపట్టనున్న సర్వేలో జాతీయ భావం పెరిగేదాని కోసం భారతీయతే కులంగా పరిగణించాలంటే భారతీయత అనే మాటను కూడా కులాల వరసలో ఏర్పాటు చేయాలని కోరారు. కులగణన సర్వేలో దివ్యాంగులు పాల్గొని పూర్తి వివరాలు అందించాలని కోరారు.

గోశాలకు రూ. 68 వేల దాణా వితరణ



దాణా వితరణ చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఆశ్వయుజ బహుళ అమావాస్య సందర్భంగా నగరంలోని గొల్లగూడెంలో ఉన్న ఓం శ్రీ కృష్ణ గోశాలకు శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన శుక్రవారం రూ. 68 వేల విలువ చేసే దాణాను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, సభ్యులు దేవరశెట్టి రామారావు, సూరినేటి మల్లేశం, గజ్జి సూర్యనారాయణ, జంగిలి రమణ, సోమారపు సుధీర్‌కుమార్, వంగవీటి నవీన్, పెనుగొండ సాయికుమార్, చల్లా రమేష్, తూములూరి నగేష్, కటకం ఉదయ్ భాస్కర్, గోశాల బాధ్యులు కేసా హనుమంతరావు, చైన్‌సింగ్ రాజ్‌పురోహిత్, నరేన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ‘దీప’కాంతులు

విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి వేడుకలను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న, పెద్ద తేడా లేకుండా దీపాలు వెలిగించి టపాసులు, కాకరవత్తులు, చిచ్చుబుడ్లు కాల్చి మోతమోగించారు. ఆకాశమే హద్దుగా తారాజువ్వలు కాల్చి కనువిందు చేశారు. మహిళలు ప్రమిదలు వెలిగించడంతో పాటు లక్ష్మి పూజలు చేశారు. ఇళ్లను దీపకాంతులతో శోభాయమానంగా అలంకరించారు. వ్యాపారులు ధనలక్ష్మిని ప్రత్యేకంగా కొలిచి అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దీపావళి వేడుకలు జరుపుకుంటున్న నగర వాసులు



కుటుంబ సభ్యులతో కాకరపూలు కాల్చుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



ఖమ్మంమయూరిసెంటర్: కుటుంబ సభ్యులతో మేయర్ పునుకొల్లు నీరజ



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో బాణాసంచా కాలుస్తూ సంబరాలు

పొగ కమ్మేసింది..



గురువారం రాత్రి బాణాసంచా కాల్చిన అనంతరం నగరంలోని బైపాస్ రోడ్డు

దీపావళి పండుగ రోజు నగర ప్రజలు బాణాసంచా కాల్చడంతో నగరం అంతా పొగతో కమ్మేసింది. గురువారం రాత్రి వీధులన్నీ కాలుష్యం అలుముకుని కనిపించగా.. శుక్రవారం రాత్రి అవే వీధులు తేటగా కనిపించాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



శుక్రవారం రాత్రి ఇలా..

కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్న ఎన్యుమరేటర్లకు కేఎంసీ అధికారులు శిక్షణ ప్రారంభించారు. నగరంలో 946 మంది ఎన్యుమరేటర్లను ఈ సర్వేకు వినియోగిస్తుండగా.. ప్రస్తుతం మెప్మా ఆర్పీలు, ఆశలు, అంగన్‌వాడీలకు శుక్రవారం మొదటి విడత శిక్షణ స్థానిక డీపీఆర్‌సీ భవనంలో ప్రారంభించారు. తొలి రోజు ఆర్పీలు 164 మంది, ఆశాలు 85 మంది, అంగన్‌వాడీలు 204 మందికి సర్వేలో సేకరించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కుటుంబాల నుంచి ఎటువంటి ధ్రువపత్రాలను తీసుకోవద్దని, సర్వే ఫారంలో ఉన్న వివరాలను అన్ని కుటుంబ యజమాని, సభ్యులను అడిగి నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని, ఒకే చోట కూర్చుని ఫారాలను నింపావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఆర్ఓ జి.శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సర్వేకు సంబంధించి 453 మంది ఎన్యుమరేటర్లు ఏర్పాటు కాగా మరో 500 మంది కోసం వివిధ శాఖల సిబ్బందిని వినియోగించుకునేందుకు కేఎంసీ కమిషనర్ జిల్లా ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు.



డీపీఆర్‌సీలో శిక్షణ ఇస్తున్న కేఎంసీ అధికారులు

బదిలీ ఆర్డీఓకు సన్మానం



ఆర్డీఓను సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ఆర్డీఓ గణేష్ ఇటీవల తొర్రూర్ ఆర్డీఓగా బదిలీ కావడంతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు, వరదల సందర్భంగా సమర్థవంతంగా పనిచేసి, ఉత్తమ సేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, కలెక్టరేట్ ఏఓ అరుణ, కలెక్టరేట్ సూపరింటిండెంట్‌లు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న పాలకులు

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్దాల పాటు కార్మిక లోకం పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు హరిస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బీజీ క్లైమెంట్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఖమ్మం రోటరీ నగర్ పర్ణశాలలో సంఘ పైలాన్ వద్ద ఆయన పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విరామం ఎరుగని పోరాటాలతో ముందుకు సాగుతున్న సంఘం ఎప్పుడూ కార్మికుల పక్షానే నిలబడిందన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ శ్రమ దోపిడీ జరుగుతుందని, ఒకే పనికి ఒకే వేతనం కోసం ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుందన్నారు. అసంఘటిత రంగంలోను శ్రమ దోపిడీకి అంతే లేకుండాపోయిందని పేర్కొన్నారు. కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని క్లైమెంట్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, నాయకులు సీహెచ్.సీతామహాలక్ష్మి, పాటి అప్పారావు, పిల్లి రమేష్, పేరబోయిన మోహన్ రావు, ఎండీ జాకీరుద్దీన్, పిట్టల మల్లయ్య, మల్లేష్, ఇబ్రహీం, రావుల శ్రీనివాస్, పాషా, బోడ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

‘డ్రగ్స్’పై అవగాహన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో డ్రగ్స్ నియంత్రణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, శాంతినగర్ హెచ్‌ఎం డాన్‌బాస్కో, కుచవల్లి హైస్కూల్ హెచ్‌ఎం కట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాన్ పరాక్, గుట్కాలు, సిగరెట్లు తదితర విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గురుకులానికి జిరాక్స్, ప్రింటర్ మిషన్లు వితరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల కళాశాలకు ఎస్‌ఆర్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యాన జిరాక్స్, ప్రింటర్‌లను వితరణగా అందజేశారు. ఈమిషన్లను శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ చేతులమీదుగా అందజేయగా.. అదనపు కలెక్టర్‌కు కళాశాల గురించి, విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిపై ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కళాశాల ఆవరణలో వేదిక నిర్మించేందుకు సహకరిస్తామని ఎస్‌ఆర్‌వి ఫౌండేషన్ బాధ్యులు లాక్స్ చేపూరి, కిరణ్మయి కేసా హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి కోసం ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బయ్యన బాబూరావు, బోనాల రామకృష్ణ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

ఖమ్మంగాంధీచౌక్: శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి జన్మదినం సందర్భంగా జిల్లా వికాస తరంగిణి ఆధ్వర్యాన నగరంలోని మోతీనగర్‌లో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, 35వ డివిజన్ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, కనకదుర్గ, కేసా సత్యం, వాణి, కృష్ణప్రసాద్, లక్ష్మీనారాయణ, కొణతం లక్ష్మణ్, పావని, బేబి రాణి, తాయారమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు చేకూరి, ఎస్‌వీల విగ్రహావిష్కరణ

ఖమ్మంరూరల్: జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ చేకూరి కాశయ్య, ఎస్‌వీ నారాయణల విగ్రహాలను ఈనెల 3న ఆవిష్కరించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గంగవరపు శంకరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని పోలేపల్లిలో గల గురుదక్షిణ ఫౌండేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం దుగ్గినేని రామారావు భవన్‌ను కూడా ప్రారంభోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. కాశయ్య అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ సెక్రటరీ సత్యనారాయణప్రసాద్, డైరెక్టర్ జీవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం సహకారనగర్: అధ్యాపకులు, ప్రొఫెసర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, సీపీఎస్ అధ్యాపకుడు డాక్టర్ కొలిపాక వెంకటేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు పలు విద్యాలయాల్లో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వీరేశం, కె.నర్సింహారావు, రమేష్, అశోక్, వెంకటస్వామి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: పొలం వద్ద దారి పంచాయితీలో ఓ యువకుడిపై దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడు కథనం ప్రకారం.. మండలంలోని మంగ్రాజుపల్లి గ్రామానికి చెందిన పానుగోతు రవిని అదే గ్రామానికి చెందిన లావుడ్యా కోటేశ్వరరావు కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గతకొంత కాలంగా పొలం వద్ద ఇరువురు మధ్య దారి పంచాయితీ నడుస్తోంది. కాగా, వరి కోత మిషన్‌ను తీసుకొస్తుండగా.. మాటమాట పెరిగి కోటేశ్వరరావు కర్రతో రవిని కొట్టడంతో గాయాలు కాగా స్థానిక ఆస్పత్రికిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై పి.సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరిఫ్ నాసింఖాన్‌ను కలిసిన ముస్తఫా

ఖమ్మంమయూరిసెంటర్: మహారాష్ట్ర చండీవాలి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆ రాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి ఆరిఫ్ నాసింఖాన్‌ను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ముస్తఫా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ముస్తఫాకు ఆరిఫ్ నాసింఖాన్ ఎన్నికల ప్రచార బాధ్యతలు పార్టీ అప్పగించడంతో ఆయన అక్కడకు వెళ్లారు.

కోతికి అంత్యక్రియలు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన యువకులు రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఓ కోతికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెరుగు వెంకటేశ్, వేముల కృష్ణ, సింగం రామకృష్ణ, శీలం చందు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమనిఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం కామేపల్లి రైతువేదికలో కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ నెల 6 నుంచి జరిగే కులగణనలో ప్రతీ ఒక్కరు వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామేపల్లి, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబయాదవ్, సొసైటీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, ఆరెం రవి, బొడ్డు లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే డైట్ చార్జీల పెంపు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ఏఐఎస్ఎఫ్ చేసిన పోరాట ఫలితమే నేడు తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుందని సంఘ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, అర్ధాకలితో విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మెస్ ఛార్జీలను 40 శాతం మేర పెంచడం అభినందనీయమన్నారు. ఇకనైనా వసతిగృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. చలికాలం సమీపిస్తున్న నేపథ్యాన విద్యార్థులకు తక్షణమే దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు వసతి గృహాల భవనాలకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, వంశీ, నాయకులు రాకేష్, ప్రతాప్, గణేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇది కంటితుడుపు చర్య

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు డైట్‌చార్జీల పెంపు కంటితుడుపు చర్య అని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యం అన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చే అంత కూడా ఇవ్వకుండా, ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.2,100 సరిపోవని, దానిని రూ.4 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్ట్ సమాజాన్ని సాధించాలి

ఖమ్మంమయూరిసెంటర్: సోషలిస్ట్ సమాజాన్ని సాధించడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన అమరవీరుల సభలో ఆయన మాట్లాడారు. ప్రజలపై జరుగుతున్న పెట్టుబడిదారీ దోపిడీని, భూస్వాముల, పెత్తందారుల అణచివేతను ఓడించాలన్నారు. రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కనీసం రైతు బీమా, కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, జి.రామయ్య, అర్జున్‌రావు, ఝాన్సీ, కోలేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక

కామేపల్లి: గ్రామ పంచాయతీ కార్యదర్శుల మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎండీ.ఫజల్, ప్రధాన కార్యదర్శిగా జె.రాంలాల్, గౌరవ అధ్యక్షుడిగా జి.శంకర్, ఉపాధ్యక్షుడిగా బి.ప్రవీణ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్.అనిత, కోశాధికారిగా నాగేంద్రబాబు ఎన్నికయ్యారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

కూసుమంచి: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సత్యవర్ధన్ రాజు కోరారు. గురువారం మండలంలోని రాజుపేటగ్రామంలో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు రైతులు కేంద్రాలను ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.2,320 మద్దతు ధరతో పాటు బోనస్‌ను చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఫోటో...321... కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

రఘునాథపాలెం: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు పాటిస్తూనే వేగంగా పూర్తిచేయాలని టౌన్ ప్లానింగ్ అధికారి ప్రసాద్ సూచించారు. రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన సందర్భంగా చెరువులు, ప్రభుత్వ భూములు, ఇనాం భూములు కాకుండా సరైన రిజిస్ట్రేషన్ కలిగినవి మాత్రమే ఆమోదించాలన్నారు. టీపీఓ భాస్కర్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 40వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



కూసుమంచిలో నివాళులర్పిస్తున్న నాయకులు



కామేపల్లిలో..

పునాదికే పరిమితం..!

- అసంపూర్తిగా తహసీల్ ప్రహరీ నిర్మాణ పనులు
- నిర్మాణంలోనే తుప్పపడుతున్న సామగ్రి
- పట్టించుకోని అధికారులు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని తహసీల్దార్ కార్యాలయానికి రక్షణగా ఉండాల్సిన ప్రహరీ.. నిర్మాణం పూర్తికాక తీసిన పునాదుల్లోనే తుక్కెక్కుతోంది. గతేడాది రూ.25లక్షలతో నూతన తహసీల్ నిర్మించి ప్రారంభించి అందులోనే ప్రజల కోసం టాయిలెట్ల నిర్మాణంతో పాటు ప్రహరీ నిర్మించాలని పనులు మొదలు పెట్టారు. అయితే పిల్లర్ల కోసం తీసిన గుంతలు తీసి రాడ్‌బెండింగ్ పనులు పూర్తికాగా అందులోని ఇనుప సువ్వలు వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుక్కుపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ప్రహరీ నిర్మాణం పూర్తి చేసి కార్యాలయానికి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ చిరంజీవిని వివరణ కోరగా.. రూ.25 లక్షల్లో రూ.12లక్షలతో టాయిలెట్ల నిర్మాణం పూర్తయిందని, ఇటీవల బిల్లు జాప్యంకావడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడన్నారు. మిగిలిన ప్రహరీ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని చెప్పారు.



పిల్లర్ల కోసం తీసిన గుంతలు